క్లుప్తంగా

రాజీవ్ యువ వికాసంపై విచారణ



దరఖాస్తుల వెరిఫికేషన్ చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

నారాయణఖేడ్: రాజీవ్ యువ వికాసం పథకంపై నిజాంపేట్ మండలం, నాగ్దర్ గ్రామాల్లో ఎంపీడీఓ సంగ్రాం ఆధ్వర్యంలో మండల టీం సభ్యులు ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. దరఖాస్తు దారుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించి పథకానికి అర్హుడా, కాదా ఆర్థిక పరిస్థితి ఏమిటి, జీవన విధానం, పథకాన్ని కొనసాగించే పరిస్థితి ఉందా, లేదా వాహనాలు, భూములు కలిగి ఉండి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నారా తదితర అంశాలపై విచారణ చేశారు. దరఖాస్తు దారుడి నుంచి ఆయా అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

జహీరాబాద్: మండలంలోని హోతి(కె) గ్రామ శివారులో ఇటుక బట్టీల పక్కన ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ఏడుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,140లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు ప్రొబేషనరీ ఎస్ఐ సుజిత్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన కె.అశోక్, కాంతారెడ్డి కాలనీకి చెందిన ఉప్పరి రాములు, పాషామియా, రాంనగర్‌కు చెందిన ఎం.డి.ఖాశీం, ఖాన్‌మహెలాకు చెందిన ఎం.డీ.గౌస్, దిడిగికి చెందిన మోహన్, గోపన్‌పల్లికి చెందిన జి.నర్సింహులును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



తిరుమలలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు మంగళవారం తమ పెళ్లిరోజును పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. నియోజకవర్గ ప్రజలపై స్వామివారి చల్లనిచూపు ఉండాలని స్వామివారిని కోరుకున్నారు.

ఘనంగా అమ్మవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని శ్రీ రేణుకఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మదేవి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి ధ్వజస్తంభ ఏర్పాటు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం రేణుకఎల్లమ్మ కల్యాణోత్సవం నిర్వహించడంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న స్వప్న

మునిపల్లి(అందోల్): ఎంపీడీఓ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ స్వప్న మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని 2022- 23- 24 సంవత్సరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామాల అభివృద్ధి, ఉపాధి హామీ పనులు ఏ గ్రామంలో సీసీ రోడ్లు వేశారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పలు రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినంద్ రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కనం.. నిర్వహణ శూన్యం

- పట్టణంలో అధ్వానంగా పార్కులు
- పట్టించుకోని బల్దియా అధికారులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పార్కుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. నీటి వసతి లేక మొక్కలు, చెట్లు ఎండిపోయాయి. పర్యవేక్షణ లేక పచ్చదనం కనుమరుగయింది. పిల్లల ఆట వస్తువులు దెబ్బతిన్నాయి. సేద తీరాల్సి ప్రాంతం, పిల్లల ఆట స్థలంగా మారింది. పార్కుల అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దోచేస్తున్నారు. ఒక్కప్పుడు పచ్చదనంతో కళకళలాడిన పార్కులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు నిద్రమత్తు వీడట్లేదు. జహీరాబాద్ పట్టణంలో అన్ని హంగులతో ఉన్న పార్కులు నిర్వహణ లోపం వల్ల కొట్టుమిట్టాడుతున్నాయి. పలుమార్లు లక్షల రూపాయలు ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. సుమారు పదహారు సంవత్సరాల క్రితం హౌసింగ్ బోర్డు కాలనీలోని విశాలమైన స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించి మధ్యలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెట్లను పెంచారు. మధ్యలో పచ్చిగడి పరిచి క్రమం తప్పకుండా నీళ్లు పెట్టడంతో పార్క్‌లో ఆహ్లాదం నెలకొంది.



వెలవెలబోతున్న హౌసింగ్ బోర్డు పార్కు

నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు..

ప్రజలకు ఉపయోగపడే పార్కులను పట్టించుకొనేవారు లేక ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చెడిపోయిన బోరుకు మరమ్మతులు లేక వృథాగా పడి ఉంది. మొక్కలు, పెద్దపెద్ద చెట్ల కూడా నీళ్ల లేక ఎండిపోయి కళాహీనంగా కనిపిస్తున్నా యి. ప్రహరీ గోడలు బీటలు వారి కూలుతున్నాయి. ప్రజలు రావడం మానేయడంతో పార్కు పిల్లలకు ఆటస్థలంగా మారింది. పార్కు అభివృద్ధికి ఐదారు ఏళ్ల క్రితం రూ. 50 లక్షలు మంజూరు చేశారు. సదరు కాంట్రాక్టర్ పార్కులో వాచ్‌మెన్ రూం పనులు ప్రారంభించి వదిలేశారు. పార్కు లో ఎక్కడ చూసిన చెత్త, మద్యం సీసాలు కనిపిస్తున్నాయి.



పార్కులో కరువైన పచ్చదనం

ఎస్‌జీఓఎస్ పార్కు కూడా..

పట్టణంలోని ఎన్‌జీఎఎస్ కాలనీలోని పార్కు కూడా పర్యవేక్షణ లేక ఆధ్వానంగా మారింది. పిల్లలు ఆడుకొనేందుకు ఆటా ఏర్పాటు చేసిన వస్తువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. నాసిరకం సామగ్రి దెబ్బతిన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో పలుకాలనీలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. బల్దియా అధికారులు వీటిపై దృష్టి పెట్టకుండా గాలికి వదిలేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేసి . కబ్జాకు గురవుతున్న పార్కు స్థలాలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మైలాన్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని మైలాన్ పరిశ్రమలో మంగళవారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం పరిశ్రమలోని నాలుగవ అంతస్తులోని ఆర్‌అండ్‌డీ యూనిట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా పలు పరికరాలు కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. ఘటన స్థలాన్ని సీఐ రవీందర్ రెడ్డి సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఘటన జరిగిన సమయంలో సిబ్బంది కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



మైలాన్ పరిశ్రమలో చెలరేగిన మంటలు

కొండ గొర్రెపై కుక్కల దాడి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె

చికిత్స కోసం తరలిస్తుండగా మృతి

కల్హేర్(నారాయణఖేడ్): కొండ గొర్రెపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన గొర్రెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం కల్హేర్ మండల కేంద్రం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. కల్హేర్-మాసాన్‌పల్లి రోడ్డు పక్కన వ్యవసాయ పొలాల్లో కొండ గొర్రె సంచరిస్తుండగా కుక్కలు గుంపుగా వచ్చి దాడి చేశాయి. దీంతో గొర్రె తీవ్రంగా గాయపడింది. స్థానికులు చూసి కుక్కల మందను చెదరగొట్టారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది వచ్చి పశువైద్య సిబ్బందికి పిలిపించారు. చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలిస్తుండగా మరణించింది.

రోడ్ల పక్కన చెత్త వేస్తే చర్యలు తప్పవు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్ల పక్కన చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్ప జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో ఉప కమిషనర్ సురేష్, వివిధ శాఖల అధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కాలనీలోని రోడ్లపై వాహనదారులు చెత్త వేస్తున్నారని తెలిపారు. అలాగే, కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసులు సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి, కాలనీవాసులు రాజుగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, రమేష్, వేణగోపాల్, పండారిలు పాల్గొన్నారు.



రోడ్ల పక్కన వేసిన చెత్తను చూపిస్తున్న కాలనీవాసులు

జాతీయ లోక్ అదాలత్‌తో లబ్ధి

సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

జహీరాబాద్: జూన్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.కవితాదేవి పేర్కొన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీమార్గంతో రాజీ పడే కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. బాధితులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌పై గురించి తెలుసుకోవాలనుకుంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయం, న్యాయవాదులు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం నందు సంప్రదించవచ్చన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవితాదేవి

సంక్షిప్త వార్తలు

◆ డైట్ పనితీరు పరిశీలన

సంగారెడ్డి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం డైట్ పనితీరును టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ డాక్టర్ సుదీర పరిశీలించారు. ఆయా వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న ఆహారంపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని ఎంసీహెచ్, జనరల్ వార్డ్ , మేల్, ఫిమేల్ వార్డుల్లో ఉన్న రోగులతో మాట్లాడి సరైన ఆహారం సమయానికి అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, డైట్ ఇన్‌చార్జి బాలస్వామి, ఆర్ ఎంఓ అంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

◆ దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

సంగారెడ్డి జోన్: ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు స్నేహితుల బృందం సభ్యులు వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో స్నేహితుల బృందం సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్ మధుగౌడ్, నరేంద్ర, ప్రవీణ్ రెడ్డి, రాకేష్, జయరాజ్ పాల్గొన్నారు.

◆ విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన సిర్గాపూర్ మండలం అంతర్గాం శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాలాజీరావుకు చెందిన రైతు ఆవు రోజు మాదిరిగానే గ్రామ శివారులో మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న కరెంట్ తీగలను తాకింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు అధికారులను కోరారు.

◆ ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షుడిగా సత్యనారాయణ

జహీరాబాద్ టౌన్: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జహీరాబాద్ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వినాయక్ పవార్ తెలిపారు. పట్టణంలోని అతిథిఇన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామకపత్రాన్ని అందజేశారు. అవినీతి, అక్రమాలను అరికట్టడానికి కమిటీలు పనిచేస్తాయన్నారు. న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు రాజనర్సింహ్మ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ రావిఆకుపై కన్యకాపరమేశ్వరీ

నారాయణఖేడ్: ముఖ్యంగా ఆర్యవైశ్యులు ఎంతో భక్తితో పూజించే శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి బుధవారం నిర్వ హించనున్నారు. ఈ సందర్భంగా ఖేడ్ పట్టణానికి చెందిన ప్రముఖ లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ అశ్వత్థ పత్రంపై అమ్మవారి చిత్రాన్ని మలిచారు. చిత్రం పలువురిని ఆకట్టుకుంటుంది.



ఉపాధి హామీ పనులు చేపట్టాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కల్హేర్ మండల పరిషత్తులో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అన్ని పంచాయతీల్లో కూలీల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్‌లో రేణుక ఎల్లమ్మ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మందిరం నిర్మాణం చేపట్టారు. కల్యాణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం బాధ్యులు నారాగౌడ్, రఘుగౌడ్, రమేష్‌గౌడ్, నర్సింహగౌడ్, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను మంగళవారం ఎంపీడీఓ రమేష్‌బాబు పరిశీలించారు. స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తి కావడంతో లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనుల గురించి మేస్త్రీలకు సూచనలు చేశారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

కల్హేర్(నారాయణఖేడ్): ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురికావడంతో కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సిర్గాపూర్ మండలం రూప్లనాయక్ తండాకు చెందిన జాదవ్ పర్లల్ ఈ నెల 3న సాయంత్రం ఉజలంపాడు శివారులోని జొన్న చేనులో ట్రాక్టర్ పెట్టాడు. అదే రోజు రాత్రి వెళ్లి చూడగా ట్రాలీ కలిపించలేదు. చుట్టూ పక్కల వెతికిన దొరకలేదు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

లబ్ధిదారులకు అండగా ప్రభుత్వం నిలవాలి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 50 గజాల స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపడం లేదని బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గణేష్ పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించి 50 గజాల నిబంధన ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అలా చేసినట్లయితే దాదాపు 100 మంది లబ్ధిదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇళ్ల నిర్మించుకుంటారని తెలిపారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలిచి నిబంధన ఎత్తివేయాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణంపై హర్షం



సాయిరాంనగర్ కాలనీలో వేస్తున్న సీసీ రోడ్డు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. దీంతో సాయిరాంనగర్, కాంతారెడ్డి కాలనీ ప్రజలకు ఉపశమనం లభించనుంది. ప్రధాన రహదారి నుంచి సాయిరాంనగర్ కాలనీ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రద్దీ అధికంగా ఉండే రోడ్డుపై గుంతలు పడి దెబ్బతింది. వర్షాకాలంలో కాలినడక వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు సాయిరాంనగర్ కాలనీకి రూ. 30 లక్షలు. కాంతారెడ్డి కాలనీకి రూ. 25 లక్షల స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 450 మీటర్ల సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. సీసీ రోడ్డు పనులు చేపడుతున్నందుకు కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేయించాలని మున్సిపల్ అధికారులను కోరారు.

రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో పేరొందిన టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కోటి 70 లక్షల రూపాయలతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఆస్పత్రి నిర్మించి దశాబ్దకాలం పూర్తి కావడంతో పైపులైన్లు, డ్రైనేజీలు, డోర్లు, ఫ్లోరింగ్ మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రి పక్కనే నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిధుల నుంచి మరో కోటి రూపాయలు ఏరియా ఆస్పత్రి మరమ్మతుల కోసం కేటాయించనున్నట్లు వివరించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి సలహా సంఘం కమిటీ సభ్యులు కంకర సీనయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, టీఎస్ఎంఐడీసీఏ ఏఈ రవీందర్ రెడ్డి, ఆస్పత్రి ఆర్ఎంఓ ప్రవీణ, డాక్టర్ సల్మా, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 101 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.46 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్పనగేష్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మల్లారెడ్డి

వట్‌పల్లి(అందోల్): అధిక ఎరువులు, హానికర రసాయనాలు మోతాదుకు మించి వాడొద్దని పీజేటీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ మల్లారెడ్డి సూచించారు. మంగళవారం అందోల్ మండలంలోని సంగుపేటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అన్నదాతల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికంగా రసాయనాలను వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని మరిన్ని కొత్త చీడపీడలకు కారణమవుతాయన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకొని భద్రపర్చుకోవడంతో కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం సమన్వయ కర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ రైతులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, వేసవిలో దుక్కి దున్నే విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, ఏఈఓ లక్ష్మీకాంత్ , రేఖా, మనోజ్, శ్రీకాంత్ , ఆకాశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరం పదోవ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం జిన్నారం గ్రామశివారులోని ఎస్ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల తరువాత తమ విద్యార్థులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గురువులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పేంచలయ్య, యాదగిరి, భిక్షపతి, సంజీవరెడ్డి, అనంత రెడ్డి, శర్మ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పాకిస్తానీలను గుర్తించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జిల్లాలో అక్రమంగా నివాసముంటున్న పాకిస్తాన్ , బంగ్లాదేశ్ దేశస్తులను గుర్తించి దేశం నుంచి పంపించే చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ శంషాబాద్‌రాజు, తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు రాంబాబు గౌడ్ మాట్లాడుతూ .. అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశస్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవేందర్ గౌడ్, రాజేందర్ రెడ్డి, వీరారెడ్డి, ప్రవీణ్, సుధీర్, సాయి, నరసింహులు, వేణు, మాధవ రెడ్డి, రాజిరెడ్డిలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాలికుంటు వ్యాధి ప్రాణాంతకం



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న సిబ్బంది

రాయికోడ్, (అందోల్): గాలికుంటు వ్యాధి పశువులకు ప్రాణాంతకమని మండల పశువైద్య అధికారి పాండియన్ అన్నారు. మండలంలోని హుల్గేర గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోరు, కాళ్లకు పుండ్లు అయి మేత మేసేందుకు, నడకకు ఇబ్బంది పడతాయన్నారు. పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గి పోషకులు నష్టపోతారన్నారు. పశు వైద్య శాఖ నుంచి ఉచితంగా వేసే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు విధిగా తమ పశువులకు వేయించుకోవాలని సూచించారు. లేగలు, దూడలు గాలికుంటు వ్యాధి బారిన పడితే చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఘని, గోపాలమిత్ర బాబయ్య, పోషకులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేయనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం ఆవరణలో దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల అనుకూల చట్టాలను మార్చి కట్టుబానిసలుగా తయారు చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా తయారు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా కాంట్రాక్టు క్యాజువల్ మ్యాప్స్ ఎఫ్‌టీసీ పేరుతో పని చేయించుకుని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400